

అన్నదానానికి విరాళం


అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి సాగి విజయలక్ష్మి కుటుంబ సభ్యులు (గోగొన్నమఠం) శనివారం రూ.25వేలు విరాళం సమర్పించారు.



నిత్యాన్నదానానికి రూ.50 వేలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి అడపా రామకృష్ణ, పార్వతి దంపతులు (భీమవరం) శనివారం రూ.50 వేల విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు శనివారం 6,880క్యూసెక్కులు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2170,మధ్య డెల్టాకు 1410,పశ్చిమ డెల్టాకు 3300 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

పీఎఫ్ సొమ్ము జమ

కాకినాడ సిటీ: ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు సంబంధించి వివిధ అవసరాల కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు శనివారం వారి ఖాతాల్లో నగదు జమ చేసినట్టు జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణలు శనివారం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ యాజమాన్యంలో పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన, మరణించిన ఉపాధ్యా, ఉపాధ్యాయేతర సిబ్బందికి కూడా తుది చెల్లింపులు చేసినట్లు మీడియాకు వివరించారు. ప్రస్తుత సిబ్బందిలో కొందరి ఆర్థిక అవసరాలకు అనుగుణంగా సొమ్ము జమ చేశామన్నారు. 1244 మందికి రూ. 54,93,25,447 వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు జెడ్పీ చైర్మన్ తెలిపారు.

రూ.3.76 లక్షల విలువైన సరుకు జప్తు

కాకినాడ సిటీ: పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, నిల్వలకు సంబంధించి నమోదైన ఏడు కేసులను విచారించి రూ.3,76,276 విలువైన సరుకును ప్రభుత్వానికి జప్తు చేస్తూ ఉత్తర్వులిచ్చినట్లు జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ శనివారం తెలిపారు. ఈ మొత్తం పౌరసరఫరాల ఖాతాకు జమ అవుతుందన్నారు. వంట గ్యాస్ సిలిండర్‌ను వాణిజ్య అవసరాలకు ఉపయోగించిన దుకాణ యజమానులకు రూ.10వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి పీడీఎస్ బియ్యం, తదితర నిత్యావసర వస్తువులు అక్రమ రవాణాకు పాల్పడితే కేసులు తప్పవని హెచ్చరించారు.

వేగవంతంగా దత్తత కార్యక్రమాలు



దత్తత కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న స్త్రీ, శిశు సంక్షేమాధికారిణి ప్రవీణ

కాకినాడ సిటీ: జిల్లాలోని చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్లలో అర్హులైన పిల్లల జాబితాలను తయారు చేసి జిల్లా బాలల సంక్షేమ సమితి అనుమతితో దత్తత కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కె ప్రవీణ అధికారులను ఆదేశించారు. శనివారం కాకినాడ శిశు గృహలో దత్తత ప్రక్రియపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దత్తత కార్యక్రమం, కేర్‌పై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. శిశు గృహలోని పిల్లల పరిస్థితులపై ఆరా తీశారు. పిల్లలు ఎవరైనా దొరికినప్పుడు ఏఏ శాఖల అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవాలనే విషయంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. దత్తత ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పిల్లలు లేని తల్లిదండ్రులు వెబ్‌సైట్ ద్వారా దత్తతకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిశుగృహలో ప్రతి మంగళవారం దత్తత ప్రక్రియపై కౌన్సిలర్ ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లా బాలల సంక్షేమాధికారులు సిహెచ్ వెంకటరావు, పి లక్ష్మి, బి రామకోటి, ఎం సుధాకర్, ఎ నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

నాడు అవమానం..
నేడు బహుమానం

- రెట్టింపు కానున్న నాయీ బ్రాహ్మణుల పారితోషికం
- రూ.20 వేలకు పెంచుతూ ప్రభుత్వ నిర్ణయం
- అన్నవరం దేవస్థానంలో 74 మందికి లబ్ధి
- మాటలతో నాడు అవమానించిన చంద్రబాబు
- నేడు పారితోషికం పెంపుతో గౌరవించిన జగన్




అన్నవరం దేవస్థానం



కేశఖండన శాలలో విధుల నిర్వహణ

'జాగ్రత్త.. నా దగ్గరా మీ వేషాలు... మీ తోక ఎలా కత్తిరించాలో నాకు బాగా తెలుసు..' నాయీ బ్రాహ్మణులనుద్దేశించి ఈ మాటన్నది ఎవరో కాదు.. నాడు సీఎం హోదాలో చంద్రబాబు నాయుడు. 2018 జూన్‌లో పారితోషికం పెంచాలని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును దేవాలయ కేశఖండనశాలల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులు కలిసి అభ్యర్థించారు. దీంతో చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అన్న మాటలివి..ఇప్పటికీ ఈ మాటల్ని తల్చుకుంటూ వీరు ఆవేదన చెందుతూనే ఉన్నారు.



అదే సమయంలో విపక్ష నేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేశారు. ఆయన్ను నాయీ బ్రాహ్మణులు కలిసి గోడు విన్నవించుకున్నారు. అధికారంలోకి వచ్చాక తప్పకుండా పారితోషికం పెంచుతామని జగన్ అప్పట్లో హామీ ఇచ్చారు. జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక నాయీ బ్రాహ్మణుల వెతలు తీర్చేందుకు చర్యలు తీసుకున్నారు. కేశఖండనశాలలో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు నెలవారి పారితోషికం ఒక్కసారిగా రూ.తొమ్మిది వేల నుంచి రూ.20 వేలకు పెంచాలని నిర్ణయించారు.



అన్నవరం: దేవాలయాలలో స్వామి, అమ్మవార్లకు భక్తుల తరఫున పూజలు, అర్చనలు, అభిషేకాలు చేయాలంటే అర్చకులు తప్పనిసరి. అదే విధంగా భక్తుల తలనీలాల (కేశఖండన) మొక్కు చెల్లించాలంటే నాయీ బ్రాహ్మణులు ఉండాల్సిందే. దేవాలయాలలో వీరి పాత్ర కీలకమైనా నెలవారీ వీరికిచ్చే పారితోషికం చాలా తక్కువ. కేశఖండనకు దేవస్థానం నిర్ణయించిన కమిషన్‌తో బతుకులు నెట్టుకొచ్చేవారు. అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో నాయీ బ్రాహ్మణులకు నెలవారీ పారితోషికం సరాసరి రూ.తొమ్మిది వేలు మాత్రమే. తాజాగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం వీరి జీవితాల్లో కొత్త వెలుగులను నింపనుంది. వీరి ఆదాయం రెట్టింపు కానుంది. టిక్కెట్‌పై కమీషన్‌తో సంబంధం లేకుండా నెలకు రూ.20 వేలు పారితోషికం చెల్లించాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఈ నిర్ణయంతో నాయీ బ్రాహ్మణుల నుంచి హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.

తలనీలాల ద్వారా ఆదాయం

అన్నవరం దేవస్థానంలో భక్తుల తలనీలాల మొక్కు ద్వారా రూ.2.80 కోట్లు ఆదాయం వస్తోంది. ఏటా దాదాపు నాలుగు లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పిస్తున్నారు. కేశఖండనకు రూ.25 టిక్కెట్. టికెట్ ఆదాయంతోపాటు తలనీలాల విక్రయం ద్వారా కూడా కొద్దో గొప్పో ఆదాయం సమకూరుతోంది. ఇకపై కేశఖండన టిక్కెట్ రూ.40కి పెంచి వచ్చిన ఆదాయంతో పాటు తలనీలాల విక్రయాల నుంచి మరి కొంత ఆదాయం కలిపి నాయీ బ్రాహ్మణులకు నెలకు రూ.20 వేలు పారితోషికం చెల్లించనున్నారు.

74 మందికి లబ్ధి

అన్నవరం దేవస్థానంలోని కేశఖండనశాలలో 74 మంది నాయీ బ్రాహ్మణులు పనిచేస్తున్నారు. కేశఖండన టిక్కెట్ రూ.25 ఉండగా దానిపై వచ్చే ఆదాయాన్ని కమీషన్ రూపంలో ఇప్పటివరకూ వీరికి సమానంగా పంపిణీ చేస్తున్నారు. కార్తికం, మాఘం, వైశాఖం, శ్రావణం వంటి నెలల్లో ఎక్కువ మంది భక్తులు తలనీలాలు సమర్పిస్తారు. కాబట్టి ఆయా నెలల్లో వీరికి రూ.12 వేల వరకు పారితోషికం వచ్చేది. మిగిలిన ఎనిమిది నెలల్లో రూ.5 వేల నుంచి రూ.8వేల వరకు మాత్రమే వచ్చేది. ఇకపై వీరు సీజన్లతో సంబంధం లేకుండా నెలకు రూ.20 వేలు పారితోషికం అందుకోనున్నారు. ప్రభుత్వం తాజా నిర్ణయం ఫలితంగా 74 మంది నాయీ బ్రాహ్మణులు లబ్ధిపొందనున్నారు.

బతుకుల్లో వెలుగులు



చాలీచాలని కమీషన్‌తో ఇబ్బందుల పాలవుతున్న మా బతుకుల్లో సీఎం జగన్ ఆనందం నింపారు. దేవస్థానాలలో పనిచేసే నాయీ బ్రాహ్మణులపై సంక్షేమ దృష్టి సారించిన ముఖ్యమంత్రి ఈయన. దేవస్థానంలో పనిచేసే మాకు నెలకు రూ.పది వేలు కమిషన్ రావడం కష్టంగా ఉండే పరిస్థితుల్లో నెలకు రూ.20 వేలు పారితోషికం ఇవ్వడం చాలా సంతోషం.

\- కె గణేష్.,అధ్యక్షుడు, రాష్ట్ర దేవస్థానాల నాయీ బ్రాహ్మణుల జేఏసీ

ఒకేసారి రెట్టింపు పెంపు



పారితోషికం ఒక్కసారిగా రెట్టింపు కావడం చాలా సంతోషం. ప్రభుత్వం ఇంత సానుకూలంగా స్పందిస్తుందని ఊహించలేదు. అన్నవరం దేవస్థానంలో 74 మంది నాయీ బ్రాహ్మణులకు ఈ నిర్ణయం వల్ల ప్రయోజనం చేకూరుతుంది. ఇప్పటి వరకు నెలకు సరాసరిన రూ.9 వేలు మాత్రమే వచ్చేది. అది రూ.20 వేలకు పెంచడం ఆనందంగా ఉంది.

\- ఎం. వేంకట రమణ, అధ్యక్షుడు, అన్నవరం దేవస్థానం నాయీ బ్రాహ్మణ సంఘం

జగన్ మమ్మల్ని గౌరవించారు



పారితోషికం పెంచాలని గత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఐదేళ్ల క్రితం కలిసి కోరాం. మీ తోక కత్తిరిస్తామని ఆయన మమ్మల్ని హెచ్చరించి అవమానించారు. ప్రస్తుత సీఎం జగన మోహన్‌రెడ్డి మమ్మల్ని గౌరవించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ నెరవేర్చారు. పారితోషకం రూ.20 వేలకు పెంచిన ఆయనకు రుణపడి ఉంటాం.

\- సాయివేంకట ప్రసాద్, అన్నవరం దేవస్థానం

సుంద'రుడా'యే లక్ష్యం..

సాక్షి, రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (రుడా) పరిధిలో సుందరీకరణ, పలు రకాల అభివృద్ధి పనులకు మార్గం సుగమమైంది. రూ.18 కోట్ల బడ్జెట్ అంచనాలతో భవిష్యత్తులో చేపట్టబోయే పనులకు సంబంధించి ప్రణాళికలు రూపుదిద్దుకున్నాయి. ఈ మేరకు శనివారం స్థానిక రుడా కార్యాలయ సమావేశ మందిరంలో రుడా నాలుగో బోర్డ్ సమావేశం వేదికైంది. ప్రజా ప్రయోజనం, ఆరోగ్య రక్షణ, ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పే పనులకు బోర్డు ప్రాధాన్యం ఇస్తోంది. రుడా చైర్‌పర్సన్ షర్మిలా రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, బోర్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత బోర్డు మీటింగ్‌లో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలుపై సభ్యులు చర్చించారు. ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు. తాజాగా రూ.18 కోట్ల పనులను ప్రతిపాదించగా బోర్డు ఆమోదముద్ర వేసింది.

బోర్డు ఆమోదించిన పనులను పరిశీలిస్తే..



వివరాలు వెల్లడిస్తున్న 'రుడా' చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి, చిత్రంలో కమిషనర్ దినేష్‌కుమార్

- రుడా పరిధిలో నిర్వహించే పనుల్లో పట్టణాల సుందరీకరణ, వాకింగ్ ట్రాక్‌లు, రివిట్‌మెంట్‌తో కూడిన వాటర్ బాడీ, బీచ్ ఫ్రంట్ నిర్వహణ లాంటి పనులకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తున్నారు.
- అనపర్తి నియోజకవర్గం బలభద్రపురంలో రూ.1.50 కోట్లతో వాకింగ్ ట్రాక్, రివిట్‌మెంట్‌తో కూడిన వాటర్ బాడీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశారు.
- కొత్తపేట నియోజకవర్గంలోని ఆత్రేయపురం వద్ద వార్ఫ్ రోడ్డు వద్ద రూ.1.50 కోట్లతో రివర్ ఫ్రంట్ పనులకు మార్గం సుగమమైంది. దీంతో ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలన్నదే ముఖ్య ఉద్దేశంగా పెట్టుకున్నారు.
- నిడదవోలు మున్సిపాలిటీలోని చిన్న కాశీ రేవు నుంచి గూడెం గేటు వరకు రహదారి నిర్మాణానికి రూ.కోటి వెచ్చించనున్నారు.
- గోష్పాద క్షేత్రం సమీపంలోని కొవ్వూరు కట్ట వెంబడి రివర్ ఫ్రంట్ ప్రాంతం అభివృద్ధి చేపట్టి భక్తులకు స్వాంతన కలిగించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు గాను రూ.1.25 కోట్లు ఖర్చు చేయనున్నారు.
- రుడా ఏర్పడి ఏడాది దాటినా నేటికీ సొంత కార్యాలయం లేదు. రూ.10 కోట్లతో రుడా కార్యాలయ నిర్మాణానికి బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.
- విమాన ప్రయాణికులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించే దిశగా అడుగులు వేస్తున్నారు. రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్ రోడ్డు వెంబడి ఉన్న సెంట్రల్ లైటనింగ్ పోల్స్‌కు ఎల్ఈడీ మోటిఫ్ ఏర్పాటుకు రూ.75 లక్షలు వెచ్చించనున్నారు.
- రూ.2 కోట్లతో కోరుకొండ జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్‌స్టాప్ పునరుద్ధరణ, సుందరీకరణ, వసతుల కల్పనకు బోర్డు ఆమోదం తెలిపింది.

శివారు ప్రాంతాలకు
ఆనంద'జల్లు'



కిర్లంపూడి ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

- జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షం
- వరికి ఇబ్బంది లేదంటున్న అధికారులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావంతో జిల్లాలో రెండు రోజుల నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. వానలపై ఇప్పటికే రైతాంగం అప్రమత్తమైంది. జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం నుంచి కొద్దిపాటి వాన కురుస్తోంది. పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం నుంచి దపదపాలుగా వర్షం కురిసింది. ఉదయం ఎండ కాసినా, మధ్యాహ్నం 12 గంటలు నుంచి రాత్రి వరకూ మోస్తరు వర్షం కురవడంతో సాధారణ జనజీవనానికి ఇబ్బంది తప్పలేదు. జిల్లా కేంద్రమైన కాకినాడలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ చినుకులు పడుతూనే ఉన్నాయి. తుని, పిఠాపురంలో ఓ మాదిరి వర్షం పడింది. జిల్లాలో కిర్లంపూడి, రౌతులపూడి మండలాల్లో అధిక వర్షం పాతం నమోదయ్యింది. ప్రస్తుత వర్షాలు కారణంగా వరి పంటలకు ఎటువంటి నష్టం లేదని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో 1.89 ఎకరాల్లో వరిసాగు అవుతుండగా వర్షాలు వరి పంటకు ఎంతో మేలు చేస్తాయని జిల్లా వ్యవసాయాధికారి ఎన్ విజయకుమార్ తెలిపారు. శివారు ప్రాంత రైతులు నీరు అందక ఇబ్బంది పడుతున్న తరుణంలో వర్షాలు రావడంతో సాగునీరు ఇబ్బంది ఉండదన్నారు. వరి పువ్వారం దశలో ఉందని, ఈ వర్షాలు ఎటువంటి ఇబ్బంది ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం ఏమీ లేదన్నారు. కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. కొన్నిచోట్ల వరి పంట ప్రస్తుతం గింజ పాలు పోసుకునే దశ నుంచి గింజ గట్టి పడే దశకు చేరుకుంది. వర్షాలు తగ్గే వరకూ పంట కోతలను ఆపాలని వీరు చెబుతున్నారు.

జిల్లాలో వర్షం పాతం ఇలా:

కిర్లంపూడి 2.0, రౌతులపూడి 2. 0, కాకినాడ అర్బన్ 1.4, పెద్దాపురం 1.8, కోటనందూరు 1.6, కాకినాడ రూరల్ 1. 8 , తొండంగి 1.4 , శంఖవరం 1.2, సామర్లకోట 1.2, కాజులూర 0.8 , యూ కొత్తపల్లి 0.8 , గొల్లప్రోలు 0.8 ,తుని 0.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైయ్యింది.

రత్నగిరిపై ముగిసిన కంచి పీఠాధిపతి విజయయాత్ర



శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి

అన్నవరం: కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామిజీ విజయయాత్ర శనివారం అన్నవరంలో దిగ్విజయంగా ముగిసింది. మధ్యాహ్నం స్థానిక రైల్వేస్టేషన్ రోడ్‌లోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి పీఠాధిపతి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. దాత, శ్రీలలితా రైస్ ఇండస్ట్రీ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్ దంపతులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈనెల 12వ తేదీ రాత్రి పీఠాధిపతి రత్నగిరి దేవస్థానానికి విచ్చేసిన విషయం తెలిసిందే. ఏడు రోజులూ ఆయన దేవస్థానంలో బస చేశారు. పంపా సత్రంలో త్రికాల పూజలు నిర్వహించారు. శనివారం అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్ మర్యాద పూర్వకంగా కలిసి స్వామీజీకి వీడ్కోలు పలికారు.

రత్నగిరికి 'ఏకాదశి' తాకిడి

అన్నవరం: ఫాల్గుణ బహుళ ఏకాదశి, శనివారం పర్వదినం సందర్భంగా సత్యదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రత్నగిరికి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాన్ని తెల్లవారుజామున ఐదు గంటలకు తెరిచారు. వ్రతాల నిర్వహణ ప్రారంభించారు. ఉదయం 6 నుంచి దర్శనానికి అనుమతించారు. సాయంత్రం వరకు భక్తులతో ఆలయం కిటకిట లాడింది. ప్రత్యేక దర్శనానికి గంట, సాధారణ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. స్వామివారి వ్రతాలు 2,500 నిర్వహించారు. రూ.40 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారికి ఉదయం 108 స్వర్ణపుష్పాలతో స్వర్ణపుష్పార్చన నిర్వహించారు.



సత్యదేవుని దర్శనానికి క్యూ లో నిల్చున్న భక్తులు

సాగు, తాగునీటి సమస్యలపై నిర్దిష్ట ప్రణాళిక

- అధికారులకు జెడ్పీ ఛైర్మన్ ఆదేశం
- కాకినాడలో స్థాయీ సంఘాల సమావేశాలు


స్థాయీ సంఘాల సమావేశాల్లో పాల్గొన్న జెడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: వేసవిలో సాగు, తాగునీటి సమస్యల నివారణకు నిర్దిష్ట ప్రణాళికలు అమలు చేయాలని అధికారులను జిల్లా పరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆదేశించారు. జెడ్పీ కార్యాలయంలో శనివారం స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. ఇందులో జెడ్పీ ఛైర్మన్ విప్పర్తి, వైస్ ఛైర్మన్ బుర్రా అనుబాబు, వివిధ స్థాయీ సంఘాల సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. వివిధ అంశాలకు సంబంధించి పురోగతి, కొత్తగా ప్రతిపాదించిన పనులు, జెడ్పీటీసీ సభ్యులు లేవనెత్తిన అంశాలపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలపై చర్చించారు. ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు ఆయా సంఘాల ఛైర్‌పర్సన్ల అధ్యక్షతన జరిగాయని విప్పర్తి తెలిపారు. ప్రధానంగా గ్రామీణ నీటి సరఫరా, రహదారులు, వ్యవసాయం, విద్య, వైద్యం, పంచాయతీరాజ్ తదితర అంశాలపై చర్చించామన్నారు. వ్యవసాయానికి సంబంధించి చివరి ఎకరాకు సైతం నీరందేలా కృషి చేస్తున్నామని వెల్లడించారు. సాగు, తాగునీటి సరఫరాకు సంబంధించి గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయం, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఛైర్మన్ వేణుగోపాలరావు ఆదేశించారు. గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులన్నింటినీ శుభ్రపరచి, నీటితో నింపాలన్నారు. సాగునీటి కాలువల్లో ప్రవాహం సక్రమంగా ఉండేందుకు కాలువలను శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెలలో జరిగే పదో తరగతి పరీక్షలకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని విప్పర్తి సూచించారు. కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ సమీపాన ఉన్న జిల్లా పరిషత్ కల్యాణ మండపం అందరికీ అందుబాటులో ఉండేలా గతంలో ఉన్న అద్దెను సవరించామని తెలిపారు. సవరించిన ధరతో కూడిన కరపత్రాన్ని ఛైర్మన్ వేణుగోపాలరావు, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు కలసి విడుదల చేశారు.

ఇంకా ఏం చర్చించారంటే..

- వ్యవసాయ శాఖపై జరిగిన సమీక్షలో జెడ్పీ వైస్ ఛైర్మన్, వ్యవసాయ స్థాయీ సంఘం ఛైర్మన్ బుర్రా అనుబాబు మాట్లాడారు. మూడో పంటగా అపరాలు, పచ్చిరొట్ట సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అన్ని రైతుభరోసా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీపై రైతులకు అవసరమైన విత్తనాలు అందిస్తున్నామన్నారు.
- స్త్రీ, శిశు సంక్షేమం స్థాయీ సంఘ ఛైర్‌పర్సన్ రొంగల పద్మలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, చిన్నారులకు పౌష్టికాహారం సరఫరా, నాణ్యత తదితర అంశాలపై సభ్యులు, ఐసీడీఎస్ అధికారులతో చర్చించారు. అధికారులు పలు సంక్షేమ పథకాలను వివరించారు.
- తాగునీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తామని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు కుక్కల బెడద నియంత్రణకు చర్యలు చేపడతామని చెప్పారు.
- సమావేశంలో డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మి, డిప్యూటీ సీఈఓ ఎ.రమణారెడ్డి, ఏఓ ఎం.బుజ్జిబాబు, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి


భక్తులతో పోటెత్తిన వెంకన్న ఆలయం

కోనసీమ తిరుపతి.. భక్తజన గోదారి

- వేంకటేశ్వరుని దర్శించిన 40 వేల మంది భక్తులు
- వాడపల్లిలో ప్రతిధ్వనించిన గోవింద నామస్మరణ
- రూ.16.96 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శనివారం భక్తజన గోదారే అయ్యింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రీతికరమైన శనివారం, ఏకాదశి పర్వదినం, స్వామి వారి నక్షత్రం శ్రవణం కలిసి రావడంతో వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. గోవింద నామస్మరణతో వాడపల్లి పరిసరాలు ప్రతిధ్వనించాయి. బస్సులు, సొంత వాహనాలపై దాదాపు 40 వేల మంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు. గౌతమీ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. వేకువజాము నుంచే వాడపల్లి చేరే రహదారి భక్తులు, వారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. స్వామి వారిని బుల్లితెర నటుడు తోట జానకిరామ్ (జాకీ) దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాద విక్రయాలు, ఇతర విరాళాల రూపంలో స్వామి వారికి రూ.16,96,093 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.


స్వామి వారి సన్నిధిలో బుల్లితెర నటుడు జాకీ

వైభవంగా అధ్యయనోత్సవాలు ప్రారంభం

శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక తిరు కల్యాణోత్సవాలు త్వరలో జరగనున్న నేపథ్యంలో వేద పండితులు ఆలయంలో అధ్యయనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా అళ్వారుల విగ్రహాల వద్ద వేద పండితులు వేద పఠనం చేస్తూ స్వామివారి ఆరాధనా కార్యక్రమాలు నిర్వహించారు. దివ్య ప్రబంధ పారాయణ, బాలభోగం, నివేదన, నీరాజన మంత్రపుష్పాది పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ నెల 31 నుంచి వారం రోజుల పాటు జరగనున్న స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా అధ్యయనోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఈఓ సత్యనారాయణరాజు చెప్పారు.

ఏషియన్ ఖోఖో చీఫ్ రిఫరీగా శ్రీనివాసరావు



కిర్లంపూడి: అస్సాంలో ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకూ నిర్వహించే ఏషియన్ ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలకు కిర్లంపూడికి చెందిన కర్రి శ్రీనివాసరావు చీఫ్ రిఫరీగా ఎంపికయ్యారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఖోఖో సంఘం కార్యదర్శి కె.పట్టాభిరామ్ ఈ విషయం తెలిపారు. శ్రీనివాసరావు కిర్లంపూడి యంగ్‌మెన్స్ స్పోర్ట్స్ క్లబ్ పూర్వ క్రీడాకారుడు కూడా. ఆయనను క్లబ్ అధ్యక్షుడు పెంటకోట నాగబాబు, తూర్పు గోదావరి జిల్లా ఖోఖో సంఘం ఉపాధ్యక్షుడు చదలవాడ బాబి, సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత తదితరులు అభినందించారు.

దాడి చేసిన ముగ్గురి అరెస్టు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై. చిత్రంలో నిందితులు, పోలీసు సిబ్బంది

గండేపల్లి: అమాయకుడిపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని తాళ్లూరుకు చెందిన మింది రామచంద్రరావు(రమేష్)ను గ్రామ శివారున ఉన్న శ్రీ సాయి బాలాజీ హోటల్ వద్ద ఈ నెల 16వ తేదీ తెల్లవారుజామున ముగ్గురు వ్యక్తులు విచక్షణా రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ విషయం పాఠకులకు విదితమే. ఈ దాడికి పాల్పడిన వారిలో కాకినాడ డ్రైవర్స్ కాలనీకి చెందిన ఎర్రమనీడి వరప్రసాద్‌ను ఏ1, ఉప్పలపాడుకు చెందిన అడబాల చక్రధరబాబు ఏ2, బాదం చిన వీర్రాజును ఏ3గా గుర్తించి, పోలీసులు కేసు నమోదు చేశారు. రమేష్‌పై దాడికి నిందితులు ఉపయోగించిన కర్రలు, ఇనుప రాడ్డు, ఖాళీ బీరు సీసా, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పెద్దాపురం కోర్టులో హాజరు పరచి, రిమాండుకు తరలించారు. సంఘటన జరిగిన రోజునే బాధితుడు రమేష్‌ను తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువెళ్లారు. ఈ సంఘటన నేపథ్యంలో హైవే వెంబడి ఉన్న హోటళ్లు, ధాబాల నిర్వాహకులతో ఎస్సై సమావేశం నిర్వహించారు. తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అలాగే మద్యం విక్రయాలు, తాగడం వంటి కార్యకలాపాలు నిర్వహించరాదని, రాత్రి 11 గంటల తరువాత హోటళ్లు, ధాబాలు మూసివేయలని ఆదేశించారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విలేకర్ల సమావేశంలో ఏఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

మేడపై నుంచి పడి విద్యార్థినికి గాయాలు

- హాస్టల్‌లో తోటి వారే తోసేశారని ఫిర్యాదు
- ఆమే పడిపోయిందంటున్న సహచర విద్యార్థినులు


అమలాపురం ఏరియా ఆస్పత్రిలో పల్లవి

అయినవిల్లి: తనను తోటి విద్యార్థులు మేడ పైనుంచి తోసేశారని ముక్తేశ్వరంలోని ఓ నర్సింగ్ కళాశాల విద్యార్థిని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు బూసి పల్లవి, ఎస్సై ఎస్.నాగేశ్వరరావు కథనం ప్రకారం.. కొత్తపేట మండలం పలివెలకు చెందిన ఆమె కళాశాలలో నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే కళాశాల హాస్టల్‌లో ఉంటోంది. ఇటీవల తాము బ్యాగ్‌లో దాచుకున్న నగదు పోతోందంటూ ఆమెతో చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థినులు శుక్రవారం రాత్రి హాస్టల్ నిర్వాహకులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో నిర్వాహకులు అందరి బ్యాగ్‌లతో పాటు పల్లవి బ్యాగ్ కూడా వెతికారు. శనివారం ఉదయం బ్రష్ చేసుకుంటూండగా ఆ ఎనిమిది మంది విద్యార్థినులూ తనను వెనుక నుంచి మేడపై రెండో అంతస్తు నుంచి గెంటేశారని పల్లవి చెబుతోంది. అయితే తోటి విద్యార్థులు మాత్రం శుక్రవారం రాత్రి కళ్లు తిరుగుతున్నాయని పల్లవి చెప్పిందని, అనంతరం వాంతులు కూడా చేసుకుందని అంటున్నారు. తమ బ్యాగ్‌లో దాచుకున్న నగదు పోవడం వాస్తవమని, ఆ డబ్బులు తానే తీసినట్టు పల్లవి ఒప్పుకుందని చెబుతున్నారు. ఆమే కళ్లు తిరిగి మేడ పైనుంచి పడిందని అంటున్నారు. పల్లవికి మూడుచోట్ల ఎముకలు విరిగాయని వైద్యులు చెబుతున్నారు. కళాశాల నిర్వాహకులు ఆమెను అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం పల్లవి తల్లిదండ్రులు రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పల్లవి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆస్పత్రిలోని వైద్యులకు పల్లవి రెండు విధాలుగా స్టేట్‌మెంట్ ఇచ్చినట్టు చెబుతున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం)/అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 140 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ప్రాంతీయ ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి (ఆర్ఐఓ) ఎన్‌ఎస్‌వీఎల్ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం జరిగిన సెకండియర్ ఇంగ్లిషు పరీక్షకు జనరల్ విభాగంలో 40,364 మందికి గాను 39,119 మంది విద్యార్థులు హాజరయ్యారని, 1,245 మంది పరీక్ష రాయలేదని తెలిపారు. అలాగే ఒకేషనల్ విభాగంలో 4,638 మందికి గాను 4,384 మంది హాజరయ్యారని, 254 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

డిక్కీలో ఉంచిన రూ.9.91 లక్షల చోరీ

సామర్లకోట: స్థానిక పెద్దాపురం రోడ్డులోని యూనియన్ బ్యాంకు వద్ద స్కూటర్ డిక్కీలో ఉంచిన నగదు చోరీ అయ్యింది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. వైఎస్సార్ సీపీ నాయకుడు, చిరు వ్యాపారి పుట్టా సూరిబాబు తనకు చెందిన ఒక షాపు విక్రయానికి సంబంధించి అడ్వాన్సుగా వచ్చిన మొత్తం రూ.9.91 లక్షలు యూనియన్ బ్యాంకులో డిపాజిట్ చేయడానికి శనివారం వెళ్లారు. ఒకేసారి అంత మొత్తం డిపాజిట్ చేస్తే ట్యాక్స్ పడుతుందని బ్యాంకు అధికారులు చెప్పడంతో ఆ మొత్తాన్ని తన స్కూటర్ డిక్కీలో ఉంచారు. ఆ సొమ్మును నాలుగు వాయిదాల్లో బ్యాంకులో డిపాజిట్ చేయాలని నిర్ణయించుకుని, ఇంటికి తిరిగి వెళ్లారు. ఇంటి వద్ద డిక్కీ తెరచి చూడగా సొమ్ము కనిపించలేదు. వెంటనే ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెద్దాపురం సీఐ అబ్దుల్ నబీ, సామర్లకోట సీఐ కె.దుర్గాప్రసాద్, క్రైం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు సీఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

లోక్ అదాలత్‌లో రూ.73.33 లక్షల నష్టపరిహారం అందజేత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టుల్లో శనివారం నిర్వహించిన స్పెషల్ లోక్ అదాలత్‌లో బాధితులకు రూ.73.33 లక్షల పరిహారం అందించారు. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల ప్రాంతాల్లో లోక్ అదాలత్ 31 బెంచ్‌లు ఏర్పాటు చేసి, ఉదయం 10 గంటల నుంచి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. కోర్టులో పెండింగ్ ఉన్న కుటుంబ తగాదాలు, వినియోగదారులు, పాక్షిక న్యాయ అధికార సంస్థల్లో పెండింగ్ ఉన్న మేధోసంపత్తి హక్కుల తదితర 38 కేసులను ఇరు వర్గాలతో మాట్లాడి రాజీ మార్గం ద్వారా పరిష్కరించారు.